




# మనం

తూర్పు, పశ్చిమ, కృష్ణాజిల్లాలు

సోమవారం 30 సెప్టెంబర్ 2024

4 పేజీలు

## దేశంలోనే టిడ్కో గృహాలు

# అత్యుత్తమమైనవి





- ఖర్చు ఎక్కువైనా టీడ్కో గృహ సదుపాయాలు నాణ్యతతో చేపట్టాలని ఆనాడే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నన్ను ఆదేశించారు
- టీడ్కో గృహ సముదాయాల సమస్యలను పరిష్కరించి లబ్ధిదార్లకు అందించేందుకు కృషి చేస్తా
- పాలకొల్లు పట్టణాభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తా
- ప్రతి ఇంటికి ఖచ్చితంగా మంచినీటి కుళాయిని ఏర్పాటు చేస్తాం.
- రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు డా.పొంగునూరి నారాయణ

**పాలకొల్లు, సెప్టెంబరు 29, మనం ప్రతినిధి :** దేశ విదేశాల్లో పేదల గృహ నిర్మాణాలను పరిశీలించి, రాష్ట్రంలో అత్యుత్తమమైన టిడ్కో గృహ నిర్మాణాలను నిర్మించడం జరిగిందని రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు డా.పొంగునూరి నారాయణ అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణములో పలు అభివృద్ధి పనులు, నిలిచిపోయిన టిడ్కో పనులు పర్యవేక్షణ నిమిత్తం పాలకొల్లు విచ్చేసిన రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు డా.పొంగునూరి నారాయణ టిడ్కో గృహ నిర్మాణాలను పరిశీలించిన అనంతరం పత్రికా విలేఖర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు డా.పొంగునూరి నారాయణ మాట్లాడుతూ దేశ, విదేశాలలో పేదల ఇళ్లను పరిశీలించిన అనంతరం అత్యుత్తమమైన టిడ్కోగృహ నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి మహిళా వారి కుటుంబంతో ఆనందంతో ప్రభుత్వము నిర్మించి ఇచ్చిన ఇళ్ళలో ఉండాలనేది మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష అని, దీనికి అనుగుణంగా ఎంత ఖర్చు అయినా పరవాలేదని ముఖ్యమంత్రి తెలపడంతో షన్వాన్ టెక్నాలజీతో నిర్మించడం జరిగిందన్నారు. ఇంటి నిర్మాణములలో ప్రధాన ద్వారం టేకు దర్వాజా, 2/2 నాణ్యమైన ట్రైల్స్, వంటింట్లో కిచెన్ గట్టుకు బ్లాక్ గ్రానైట్ రాయి, తదితర సామాగ్రిని వినియోగించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, మంజూరైన గృహాలు కూడా తగ్గించారని, పేదలు నిరు పేదలుగా ఉండాలనే ఆలోచన గత ముఖ్యమంత్రిది అన్నారు. పేదవాడు మంచిగా ఉండాలనే మా ముఖ్యమంత్రి టిడ్కో గృహాలను చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. 2019లో రూ.5,360 కోట్లు నిధులు మంచినీటి పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించుకోవడం జరిగిందని, వెంటనే ప్రభుత్వం మారడంతో ఈ నిధులలో ఒక్క రూపాయి కూడా గత ప్రభుత్వం ఖర్చు చేయలేదని,

(మిగతా 2లో..

## వరద ముంపు ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ఇటీవల కురిసిన వర్షాలకు జగ్గయ్యపేట పట్టణంలో ముంపుకు గురైన ధనంబోర్డు, విద్యానగర్ ,దుర్గాపురం కాలనీలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదివారంపర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు వారికి ఉన్నటువంటి సమస్యలను వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో పెన్షన్లు పెట్టలేదని ఎమ్మెల్యే రాజగోపాల్ దృష్టికి తీసుకురాగా ధైర్యంగా ఉండండి అందరినీ అన్ని విధాల ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా ముంపుకు గురైన ప్రాంతంలో గ్రావెల్ ను ఏర్పాటు చేయాలనిఅండర్ గ్రౌండ్ వాటర్‌ను తొలగించాలని మున్సిపల్ అధికారులకు మరియు రైల్వే అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ,మాజీ ఏఎంసి చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వేదులాపురి సైదా, కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, షేక్ అస్లాం, గింజుపల్లి కృష్ణ, రహీం, జానీ, జాఫర్, నంద, పాము బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనపై అసత్య ప్రచారం

- ముఖ్యమంత్రి కార్యక్రమం ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదు
- జిల్లా కలెక్టర్ డా. జి.సృజన



**విజయవాడ, సెప్టెంబర్ 29 మనం ప్రతినిధి :** వరద బాధితులకు ఆర్థిక సహాయానికి సంబంధించి ఖాతాల్లో నగదు జమకాని వారికి నేరుగా సాయం అందించేందుకు గౌరవ ముఖ్యమంత్రి సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు అంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే 90 శాతం మేర నగదు జమ చేయడం జరిగిందని.. మిగిలిన వారికి బ్యాంకు ఖాతాలు సరిగా లేనందువలన పెండింగ్లో ఉందని, ఖాతాలు వివరాలు సరిచేసుకున్న వెంటనే వారికి కూడా పరిహారం నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా అపోహలు సృష్టించవద్దని స్పష్టం చేశారు.

### దసరా ఉత్సవాల విజయవంతానికి మీడియా సహకారం అవసరం

### అధికారులు, మీడియా సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు అందిద్దాం

### జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు

## అమ్మవారి దర్శనంలో

# సామాన్య భక్తులకే పెద్దపీట

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సేవలందించి త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించి ఉత్సవాలు విజయవంతం చేయడంలో మీడియా సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు.



**విజయవాడ, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మీడియా ప్రతినిధుల సలహాలు సూచనలు స్వీకరించేందుకు ఆదివారం కలెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు.. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌతమిశాలి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామరావు తదితరులతో కలిసి పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీస్, దేవాదాయ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం జరిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో మీడియా ప్రతినిధుల సలహాలు, సూచనలు అవసరమన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకొని ఈ ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దసరా ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దసరా ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు సలహాలు అందజేశారు. మీడియా ప్రతినిధుల సూచనలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ

(మిగతా 2లో..

# అమ్మవారి దర్శనంలో సామాన్య భక్తులకే పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

సామాన్య భక్తులకు సంతృప్తికరంగా ఉండేలా అమ్మవారి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు నిరంతరం తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన జరిపించడంపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. భక్తుల దాహార్తిని తీర్చడానికి 27 ప్రాంతాలలో తాగునీటి బాటిల్స్ సరఫరా చేసేందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం లగేజీ, చెప్పులు భద్రపరుచుకునేందుకు 30 క్లాక్ రూములను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వీఐపీ, వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి వారికి దర్శనం కల్పించి సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణపై ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర కీలకమన్నారు. మీడియా ప్రతినిధులకు అవసరమైన ప్రత్యేక డ్యూటీ పాసులను జారీ జారీచేయనున్నామని తెలిపారు. ఎప్పటిలాగే కొండపైన రాజగోపురం సమీపంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసి, మీడియా ప్రతినిధుల కోసం కంప్యూటర్లు, ఇంటర్నెట్ వైఫై వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులకు ఎదురయ్యే ఇబ్బందులను సత్వరం పరిష్కరించేలా పోలీస్, దేవాదాయ శాఖ అధికారుల సమన్వయానికి సమాచార శాఖ అధికారులను లైజనింగ్ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 గం. నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఇలా.. మూడు షిఫ్టుల్లో సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించామన్నారు.

**లోటుపాట్లను సరిచేసుకుంటూ ముందుకెళ్తాం: సీపీ రాజశేఖరబాబు**

నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ గతేడాఇ ప్రింట్ మీడియాలో ప్రచురితమైన కథనాలను సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గత ఉత్సవాలలో ఎక్కడైతే లోటుపాట్లు జరుగుతున్నాయి అనేది మీడియా ప్రతినిధులు కథనాల ద్వారా తెలియచేశారో అటువంటివి పునరావృతం కాకుండా చూసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య అధికంగా ఉండవచ్చునన్న అంచనాల నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. అయితే భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా వాస్తవ సమాచారాన్ని భక్తులకు అందించి దసరా ఉత్సవాల విజయవంతంలో సహకరించాలని మీడియా ప్రతినిధులకు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అనవసర గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు ఈ ఏడాది యూనిఫామ్ తో పోలీస్ అధికారులు, సిబ్బంది అమ్మవారి దర్శనానికి అనుమతించడం లేదని ఆయన తెలిపారు. మూలా నక్షత్రం రోజున మీడియా ప్రతినిధులకు ఇబ్బంది కలగకుండా మీడియా ప్రతినిధుల ద్విచక్ర వాహనాలను మోడల్ గెస్ట్ హౌస్ వరకు అనుమతించేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు రాజీవ్ గాంధీ పార్క్, భవానీపురం ఫ్లై ఓవర్ వద్ద విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, పోలీస్, దేవాదాయ శాఖ అధికారులు సిబ్బంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేసి రానున్న ఏడాదికి స్ఫూర్తిదాయకంగా నిలిచేలా కృషిచేద్దామని ఆయన కోరారు. సమావేశంలో డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే టిడ్కో గృహాలు అత్యుత్తమమైనవి

(మొదటిపేజీ తరువాయి)

మార్చి 2024తో నిధులు కాల పరిమితి ముగిసిందన్నారు. ఇటువంటి నిర్లక్ష్యం ఏ ముఖ్యమంత్రి చేయరన్నారు. ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడటంతో ఒక సంవత్సరం కాల పరిమితిని పెంచడం జరిగిందన్నారు. ఆ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన అన్ని గృహాలకు మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయడంతోపాటు, పాలకొల్లులో ప్రతి గృహానికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం కారణంగా ప్రస్తుతం టిడ్కో గృహాల లబ్ధిదారుల రుణాల విషయంలో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడిందని, ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ఆలోచన చేస్తామన్నారు. పొరుగు రాష్ట్రాల్లో అన్న క్యాంటీన్ తరహాలో నిర్వహిస్తున్న క్యాంటీన్లను అధ్యయనం చేసి రాష్ట్రంలో ఉత్తమమైన అన్న క్యాంటీన్ల ఏర్పాటును చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీస్తుందని, అయినను ఇచ్చిన వాగ్దానం మేరకు ఒక్కొక్క కార్యక్రమాన్ని అమలు చేసుకుంటూ వస్తున్నామని, దీనిలో భాగంగా దీపావళికి. మూడు గ్యాస్ సిలిండర్లు అందించే పథకంపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. మీ శాసనసభ్యులు చొరవ, కఠోర దీక్షతో బుడమేరు వరద గండిని పూడ్చి అజిత్ సింగ్ నగర్ ప్రాంతాన్ని ముంపు బారి నుండి కాపాడగలిగారన్నారు. వీరు ఏ పని చేసినా నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తూ కష్టించి పని చేస్తారని కొనియాడారు. పాలకొల్లు అభివృద్ధికి పలు ప్రతిపాదనలను నా ముందు ఉంచారని, పాలకొల్లు పట్టణ అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి నిర్లక్ష్యం చేసి, పేదవారికి దూరం చేసిందన్నారు. సుమారు 85 నుండి 90% వరకు పనులు పూర్తయి చిన్నచిన్న పనులు పూర్తయితే గృహ నిర్మాణాలు ప్రారంభించుకునే దశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి పురపాలక శాఖ మంత్రి ద్వారా ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఇక్కడ సముదాయంలో అంగన్వాడి సెంటర్, ప్రైమరీ హెల్త్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు, ఏటీఎంలు ఏర్పాటు, తదితర మౌలిక వసల అభివృద్ధికి నిధులను మంజూరు చేసి సహకరించాలని కోరారు. పాలకొల్లు అభివృద్ధి గత ఐదు సంవత్సరాలుగా కుంటుపడిందని, ఈ విషయమై నా కుటుంబ సభ్యులతో సహా ఎన్నో దీక్షలు చేయడం జరిగిందని, అయినా గత ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లు అభివృద్ధికి ఆటంకం కలిగించిందన్నారు. త్వరలో ఒక్కొక్క సమస్యను దశలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన ప్రతినిధి బన్ని వాసు, బిజెపి ప్రతినిధి కపర్ది, స్థానిక నాయకులు జక్కంపూడి కుమార్, పెచ్చేటి బాబు, కే.విజయభాస్కర్, సూర్యనారాయణ రాజు, పెద్దిరాజు, జీవి, తదితరులు పాల్గొన్నారు.

# పలివెల పెద్ద రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులందరికి అన్నదాన కార్యక్రమం



**వేలేరుపాడు, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** రుద్రంకోట గ్రామంలో పలివెల పెద్దరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులందరికి ఆదివారం నాడు సాయంత్రం "అన్నదాన" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామస్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,గత కొద్ది 2 సంవత్సరాలుగా అనివార్య కారణాల వలన చేయలేకపోయాము,గ్రామస్తులంతా ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని మరియు రైతులకు కూడా పంటలు బాగా పండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తనకి సహకరించిన రుద్రంకోట యువతకి అభినందనలు తెలియజేశారు.

# టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి తరలిరావాలి

◆ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు



**ముదినేపల్లి, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** అక్టోబర్ 1న కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3:30 గంటలకు నిర్వహించే తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాల మండలపార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు, బూత్ కమిటీల సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమం ప్రధాన ఏజెండా పార్టీ సభ్యత్వాలు నమోదు, గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు చేపట్టుటగురించి. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లాపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర, నియోజకవర్గం పరిశీలకులు ఎం.పార్థసారథి, రాష్ట్రపార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు.

# ఆసియా ఐకాన్ 2024 అవార్డుతో ప్రపంచ దేశాల మధ్య స్నేహ బంధం పెనవేస్తున్న డా.కలశ నాయుడు

**ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డెమొక్రాటిక్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ శ్రీలంక మాజీ అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన డాక్టర్ కలశ నాయుడిని ఆసియా ఐకాన్ 2024గా సత్కరించారు**




**గాంధీనగర్, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ఇరుగు పొరుగుతో ఎన్ని ఘర్షణలున్నా ఇంటి సరిహద్దులు మార్చుకోలేము. అందుకే సరిహద్దు వివాదాలను ప్రేమ, స్నేహానుబంధాల ద్వారా మాత్రమే పరిష్కరించుకోవడం సాధ్యమని ఇండియా పాకిస్థాన్ సరిహద్దు వివాదాలపై భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ చేసిన వ్యాఖ్యలు నేటికీ ప్రపంచదేశాలకు ఆదర్శప్రాయమే. దివంగత మాజీ ప్రధాని వాజ్ పేయ్ ఆశయాలను, సూచనలను అక్షరాలా అమలు చేస్తోంది చిన్నారి కలశనాయుడు. సామాజిక సేవతో ప్రపంచ దేశాల మధ్య స్నేహ సౌరభాలను పూయిస్తున్న పదకొండేళ్ల ఆ చిన్నారి డా. కలశనాయుడు ఆసియా ఐకాన్ 2024 అవార్డును సొంతం చేసుకుంది. సేవ ద్వారా శత్రువులను కూడా స్నేహితులుగా మార్చుకోవచ్చని ఆ చిన్నారి రుజువు చేసింది. కలశ పుట్టిన సంవత్సరంలోనే ఆమె తల్లిదండ్రులు కలశ ఫౌండేషన్ను ప్రారంభించి సామాజిక సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. తల్లిదండ్రులు చేస్తున్న సేవలపై ముక్కుపచ్చలారని పసి వయసులోనే ఆకర్షితురాలైన కలశ నాయుడు ఆ కలశ ఫౌండేషన్ ద్వారా తన సేవలను విస్తత పరిచింది. తల్లిదండ్రులు ప్రారంభించిన ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను జిల్లా స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. పలు అంతర్జాతీయ సేవా సంస్థలతో కలిసి కలశ ఫౌండేషన్ ద్వారా సుమారు 135 దేశాల్లో కలశనాయుడు సేవలను అందిస్తున్నారు. పదకొండేళ్ల ఈ చిన్నారి పది సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆ చిన్నారి నిబద్ధతకు నిదర్శనమని పలువురు ప్రశంసిస్తున్నారు. అతిచిన్న వయస్సు సామాజిక సేవకురాలిగా డాక్టరేట్ అందుకున్న కలశనాయుడు ఇటీవల మరో గొప్ప అచీవ్మెంట్ సాధించారు. సోషల్ సర్వీస్ కేటగిరిలో ఆసియా ఐకాన్ 2024 అవార్డును అందుకున్న అతిచిన్న వయస్కురాలిగా డా. కలశ నాయుడు మరో సరికొత్త రికార్డు నెలకొల్పారు. శ్రీలంక రాజధాని కొలంబోలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన ఆసియా ఐకాన్ అవార్డు 2024 కార్యక్రమంలో కొలంబో గవర్నర్ సెంథిల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీలంక మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన విశిష్ట వ్యక్తులు పాల్గొన్నారు.

# ఐటీసీ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ





**కుక్కునూరు, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ఐటిసి(బిఎంఎస్) మహిళా సమితి ఆధ్వర్యంలో శనివారం సీతారామనగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, క్యారం బోర్డ్స్,క్రికెట్ కిట్స్, ఉచితముగా అందించారు. అలాగే ఐటిసి బిఎంఎస్ భద్రాచలం మహిళా సమితి ఆధ్వర్యంలో పిల్లలకు ఆట స్థలం, అలాగే పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు మరుగుదొడ్లు సౌకర్యం కల్పిస్తామని బిఎంఎస్ మహిళా సెక్రటరీ రేష్మా శర్మ తెలిపారు. మంచిగా చదువుపై శ్రద్ధ పెట్టి చదివే పేద విద్యార్థులకు భవిష్యత్తులో అనేక సౌకర్యాలు కల్పిస్తామని ఐటిసి(బిఎంఎస్) సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్ మహిళా సెక్రటరీ రేష్మి శర్మ, సభ్యులు లక్ష్మీ రాంబాబు, అల్కా ప్రఫుల్, శైలజ, వీరితోపాటు ఐటిసి ఉద్యోగి శేషు, బొల్లా రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు రఘు కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలే నా తొలి ప్రాధాన్యత

- నిమ్మల రామానాయుడు అంటే నాకు ప్రత్యేక అభిమానం
- పాలకొల్లు పురపాలక సంఘం అభివృద్ధి పనులు పూర్తి చేయుటకు సహాయ, సహకారాలు అందిస్తాను.
- రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టరు పొంగూరు నారాయణ


**పాలకొల్లు, సెప్టెంబర్ 29, మనం ప్రతినిధి :** అదివారం స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పురపాలక సంఘం అధికారులతో కలిసి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పాలకొల్లు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాలకొల్లు పట్టణంలో మిగిలి ఉన్న వివిధ అభివృద్ధి పనులు, త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, శానిటేషన్, తదితర అభివృద్ధి కార్యక్రమాలుపై మంత్రి నారాయణకు, మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ పాలకొల్లు పట్టణంలో టిడ్కో గృహాలు పూర్తి చేయడంతో పాటు, పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించి నిరుపేదలందరికీ స్వంత ఇంటికల నిజం చేస్తామన్నారు. హాస్పటల్, అంగన్వాడీ సెంటరు,షాపింగు మాల్, రైతు బజారు,ఎటిఎం, తదితర ప్రజలకు అవసరం అయిన వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.పురపాల సంఘానికి త్రాగునీరు, డ్రైనేజీ, శానిటేషన్, వీధిలైట్లు ప్రధాన దృష్టి పెడితే పురపాలక సంఘం ప్రజలు సంతృప్తి చెందారని ఫిర్యాదులు అనేవి ఒక్కటి కూడా రావన్నారు. లోటు బడ్జెట్ ఉంది కనుక ప్రస్తుతం సాయం చేసిన సిబ్బందిని పెంచే కన్నా ఆధునిక టెక్నాలజీ, సీపింగ్ యంత్రాలు ఉపయోగించి పట్టణాల శానిటేషన్ కు ఉపయోగించాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అన్నా క్యాంటీన్ తప్పనిసరిగా ఉండాలని, పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండి, ఆచంట నియోజక వర్గాలకు అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు సి.నాగారాణి కి మంత్రి సూచించారు. పాలకొల్లు పురపాలక సంఘానికి అవసరమైన నిధులను సమకూర్చి, వచ్చే నెలలో శంకుస్థాపనకు వస్తానని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణానికి అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలనకు ఆహ్వానించగా వచ్చినందుకు మంత్రి పి.నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు మూడవసారి శాసనసభ్యులు గెలిపించారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి రుణం తీర్చుకోవాలని నా తపన అన్నారు. గత ఐదేళ్లు గత ప్రభుత్వం పాలనలో 20 సంవత్సరాలు రాష్ట్రం వెనక్కి వెళ్లిందని, దీంతోపాటుగా పాలకొల్లు నియోజక వర్గం వెనకబడి ఉందన్నారు. గత ప్రభుత్వం గాలిలో కూడా పాలకొల్లు ప్రజలు నన్ను గెలిపించాలని, వారి సంక్షేమం, అభివృద్ధి చేయడమే నా ప్రధాన ఏజెండా అన్నారు. 40 వేలు జనాభాకు తగ్గట్టుగా త్రాగునీటి సరఫరా ఉందని, ప్రస్తుత జనాభా అనుగుణంగా మంచినీటి చెరువులు,



వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. టిడ్కో గృహాలు పూర్తిస్థాయిలో గృహప్రవేశాలు జరిగితే పట్టణానికి అయిదు నుండి ఆరు వార్డులు పెరుగుతాయన్నారు. అందుకు తగ్గట్టుగా నిధులు, మున్సిపల్ సిబ్బంది పోస్టులు మంజూరు చేయాలన్నారు. పట్టణంలో అన్న క్యాంటీన్ ప్రజల నుండి విశేష స్పందన కలుగు తుందని, ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికీ కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. రూరల్ గ్రామంలో ఒక అన్నా క్యాంటీన్ మంజూరు చెయ్యాలని కోరారు. ఇండ్ల స్థలాలకు గత ప్రభుత్వం పనికిమాలిన స్థలాలు ఇచ్చిందని, ఆ లబ్దిదారులకు వేరేచోట ఇంటి స్థలాలను ఇచ్చే అవకాశం కల్పించాలన్నారు. టిడ్కో గృహాలు పూర్తి చేసి అఖరు ఇంటివరకు ఇంటి తాళాలు ఇచ్చి, నిరుపేదలు అందరితో గృహ ప్రవేశాలు చేయించి స్వంత ఇంటికలను నిజం చెయ్యాలని మంత్రి రామానాయుడు కోరారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింటు కలెక్టరు టి. రాహుల్ కుమార్ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్, డైరెక్టర్ ఆఫ్ టౌన్స్ & కంట్రీ ప్లానింగు అధికారి ఆర్.జె. విద్యులత, నూతన ఆర్డీవో దాసి రాజు, వివిధ శాఖలు జిల్లా అధికారులు,పురపాలక సంఘం కమీషనరు బి.విజయ సారథి, మునిసిపల్ అధికారులు, నాయకులు జీవీ, పేచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, కర్నేని రోజారమణి, జక్కపూడి కుమార్, ధానాని సూర్య ప్రకాష్, వట్టం గణేష్, బిరుదుకోట శేఖరు, మల్లంపల్లి పకీరు బాబు, పీతల శ్రీనివాస్, చినమిల్లి గణపతి రావు, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన సిహెచ్ రజిత



**ముదినేపల్లి, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ముదినేపల్లి సబ్ రిజిస్టార్ గా సిహెచ్ రజిత బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎన్ మధుబాబు కృష్ణా జిల్లా కౌతవరంకి బదిలీపై వెళ్లారు. ఈ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న సిహెచ్ రజిత కృష్ణాజిల్లాలో మచిలీపట్నం సబ్ రిజిస్టార్ గా చేశారు. సీనియర్ అసిస్టెంట్ వి.వీరాస్వామి, జూనియర్ అసిస్టెంట్ కె.గణేష్‌లు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన సబ్ రిజిస్టార్ రజితను సిబ్బంది అభినందించారు.

# క్షిరారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న జెడ్‌పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు



**పాలకొల్లు, సెప్టెంబర్ 29, మనం ప్రతినిధి :** పాలకొల్లులో కొలువై ఉన్న శ్రీ క్షిరారామలింగేశ్వక్షిరా రామలింగేశ్వర స్వామిని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఈవో ఎం.శ్రీనివాస రావు స్వాగతం పలికారు. స్వామివారి చిత్ర పటం అందించి, సత్కరించారు.

# మంత్రి నిమ్మలని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్

**పాలకొల్లు, సెప్టెంబర్ 29, మనం ప్రతినిధి :** రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామనాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్.

# సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహానికి ఇన్వెర్టర్

◆ ఎమ్మెల్యే నెహ్రూ చేతులమీదుగా బహుకరించిన కొత్త కొండబాబు

**జగ్గంపేట, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉండడంతో తాత్కాలికంగా కోనేటి వీధిలో గల పాత మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనానికి 10 లక్షల రూపాయలతో ఆధునికరించి బాలురకు వసతి కల్పించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విద్యుత్ సమస్య ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులుగా ఉన్నాయని వార్డెన్ ప్రభాకర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు తెలియజేయడంతో ఆయన వెంటనే రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు కొత్త కొండబాబుకు ఇన్వర్టర్ బహూకరించమని కోరడం ఆయన ఆదివారం 21 వేల రూపాయలతో కొనుగోలు చేసిన ఇన్వేటర్ ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా హాస్టల్ వార్డెన్ కి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఆదినారాయణ, బద్ది సురేష్, పాలకుర్తి లక్ష్మీపతిరావు, యర్ర పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో వికలాంగుల ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం తెలిపిన జనసేన పార్టీ నాయకులు





**గొల్లప్రోలు, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** గొల్లప్రోలు పట్టణం మెయిన్ రోడ్ పాత బస్టాండ్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం8.గంటలకు వికలాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉలవశెట్టి శ్రీనివాసు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రముఖ మంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టినటువంటిప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా గొల్లప్రోలు శ్రీవారి ఆలయం వద్ద వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యులు ప్రాయశ్చిత దీక్షను ప్రారంభించారు దీనికి సంఘీభావంగా పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు దీక్షా శిబిరంలో వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు బస్సా చిట్టిబాబు గొలిపల్లిపెదబాబి కడారి తమ్మయ్య నాయుడు మామిడాల సూరిబాబు తలారి శ్రీనివాసు బుడంకాయల దొరబాబు మామిడాల రాంబాబు దివ్యాంగుల సంఘాల నాయకులు వీర మహిళలు పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 67వేల రూపాయలు ధర పలికిన గణేష్ లడ్డూ




**మైలవరం, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** కొత్తచంద్రగూడెం గ్రామంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం లడ్డు బహిరంగ వేలం వేగా శీలం వరబాబు 67వేల రూపాయలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ మేళ తాళాలతో కనకతప్పేట్లతో ఊరేగింపుగా వెళ్లి లడ్డును అప్పగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మరియు భక్తులు విరివిగా పాల్గొన్నారు.

# కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్‌కి ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు




**గాంధీనగర్ సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్‌కి ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు లభించింది. నేషనల్ జ్యువెలరీ అవార్డ్స్ 2024లో ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జిజెసి) ఈ అవార్డును ప్రధానం చేసింది. ఈ మేరకు ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ షో (జీజెఎస్) దిగ్గజ వేడుక ప్రతిష్టాత్మక జిజెఎస్ నైట్ కార్యక్రమంలో కీర్తి లాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా, డిజైన్, నవ్యావిష్కరణ, వ్యాపార నాయకత్వాల్లో శ్రేష్టమైన నైపుణ్యాలకు ఈ పురస్కారం అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు స్టోర్ ఆఫ్ ది ఇయర్ (సౌత్), రింగ్ ఆఫ్ ది ఇయర్, థీమ్ బేస్డ్ జ్యువెలరీ, బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్ (కలర్ స్టోన్) నాలుగు విభాగాల్లో కూడా కీర్తిలాల్స్ పురస్కారాలను పొందింది. ఈ కార్యక్రమంలో జీజేసీ డైరెక్టర్లు అశోక్ కుమార్ జైన్, సమర్ కుమార్ డి ఈ, సాహిల్ మెహరా, ఆసీస్ కొహారీ తో పాటు జ్యువెల్ ట్రెండ్స్ డైరెక్టర్ గోవింద్ వెర్మ పాల్గొన్నారు.

# అడుగడుగున దగా..

- త్యాగదనులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు - పోలవరం నిర్వాసితులకు అన్నిటిలో మోసం..
- ఏజెన్సీలో ఒక్కలా, మైదాన ప్రాంతంలో మరొక లాగా ఇంటి విలువ...



**కుక్కునూరు, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్ర ప్రదేశ్ జీవనాడి,, పోలవరం నిర్వాసితులు త్యాగదనులు, సర్వసం త్యాగం చేసి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరిస్తున్నారు. ఈ మాట ఆంధ్రప్రదేశ్ ఏ ప్రభుత్వం ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు ఎంపీలు, మ్మెల్యేల వరకు ఇదే మాట చెబుతున్నారు తప్ప. పోలవరం న్యాయం కంటే అన్యాయం జరుగుతుందని కుక్కునూరు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు విమర్శించారు. ఉమ్మడి రాష్ట్ర లో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి వరకు అందరూ పోలవరం నిర్వాసితులను మోసగిస్తూనే ఉన్నారు. ఏళ్లు గడుస్తున్న పరిహారం ఇవ్వకపోగా, పోలవరం నిర్వాసితులు అనేక రకాలుగా మోసగిస్తూనే ఉంది. పోలవరం నిర్వాసితులకు జంగారెడ్డిగూడెం మండలం చల్ల వారి గూడెం పునరావస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెంలో భూములకు,ఇళ్లకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించింది. ఇక్కడే మోసం ప్రారంభం అయింది. రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని గ్రామసభ సమయంలో పోలవరం నిర్వాసితలకు అధికారులు తెలియజేయలేదు. ఇల్లు, స్థలం వద్దు అనుకుంటే నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మొదటి గ్రామ సభలో అధికారులు చెప్పడంతో చాలామంది ఇల్లు, స్థలం వద్దని వాటి బదులు నగదు చెల్లించాలని చాలామంది నిర్వాసితులు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కాలంలో కొందరు చింతలపూడి సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో తమ స్థలని,ఇంటిని రిజిస్ట్రేషన్ చేపించుకుంటే సుమారు పది లక్షల వరకు వాల్యూ వస్తుంది. ఇంటి స్థలం, ఇల్లు వద్దనుకుంటే ప్రభుత్వం మాత్రం రూలు 3:85 (మూడు లక్షల యనభై ఐదు వేలు మాత్రమే) ధర నిర్ణయించి నిర్వాసితులకు చెల్లిస్తామని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఈ విధంగా చూస్తే ప్రతి నిర్వాసితుడికి సుమారు 6 లక్షల వరకు నష్టపోతున్నారు . చల్లవారిగూడెంలో సుమారు 6 గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తుంది. ఈ ఆరు గ్రామాల నుంచి ఒక గ్రామంలో సుమారు 150 నుంచి 300 మంది వరకు తమకు ఇంటి స్థలం ,ఇల్లు వద్దని తమకు నగదు రూపేనా చెల్లించాలని మొదటి గ్రామ సభలో అధికారులకు తెలియజేసి నష్టపోయారు .మొదటిసారి జరిగిన గ్రామ సభలో అధికారులు చల్లవారి గూడెంలో భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని చెప్పకపోవడమే ఎందుకు ప్రధాన కారణం. 2017 నుంచి 2024 వరకు సుమారు 10 పైనే గ్రామ సభలు అధికారులు ఏర్పాటు చేశారు. ఏ ఒక్క గ్రామసభలో కూడా అధికారులు చల్లవారిగూడెంలో ఇంటి స్థలానికి, ఇంటికి రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని చెప్పకపోవడం వలన వందల మంది నిర్వస్తులు సుమారు ఆరు లక్షల పైనే నష్టపోతున్నారు అని కుక్కునూరు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు పేర్కొన్నారు. ఇల్లు, స్థలం వద్దన్నవారికి కూడా రిజిస్ట్రేషన్ లెక్క ప్రకారం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం 10 లక్షల వరకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే సుమారు 1000 మంది నిర్వాసితులకు కోట్లల్లో నష్టం జరుగుతుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను సమానంగా పరిహారం చెల్లించి ప్రభుత్వాలు ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

# రాష్ట్ర బడ్జెట్ లోటు ఉన్నను అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత లేదు

- పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయండి
- రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టరు పొంగూరు నారాయణ



**పాలకొల్లు, సెప్టెంబర్ 29, మనం ప్రతినిధి :** ఆదివారం పాలకొల్లు పట్టణంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గానికి తొలిసారిగా అడుగుపెట్టిన రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టరు పొంగూరు నారాయణ, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానా యుడు సంయుక్తంగా పాలకొల్లు పట్టణంలో సుడిగాలి పర్యటనలు చేసి పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో పరిశీలన చేశారు.మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్,హిందూ బర్రెల్ గ్రౌండు( కైలాస వనం), డంపింగు యార్డు, డాక్టరు ఏపిజే అబ్దుల్ కలామ్ హెల్త్ పార్క్, శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, శ్రీ బొండాడ వెంకటరాజు గుప్త ఎన్టీఆర్ కళాక్షేత్రం, అన్న క్యాంటీన్,యన్టీఆర్ టిడ్కో ఇండ్ల సముదాయాన్ని పరిశీలించారు. మంత్రి నిమ్మల రామా నాయుడు పాలకొల్లు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్న పనులను తదితర విషయాలను మంత్రి పి. నారాయణకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్,మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్, మునిసిపల్ కమీషనరు బి.విజయ సారథి, స్థానిక నాయకులు పెచ్చెట్టి బాబు, జీవి, ఉన్నమట్ల కబర్ధి,బోనం నాని, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా

# తుమ్మలపల్లి రమేష్ ఒంటికాళ్లపై నిలబడి దీక్ష




**జగ్గంపేట/కిర్లంపూడి, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** జగంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో పవన్ కళ్యాణ్ గారి ప్రాయశ్చిత్త దీక్ష కు మద్దతుగా తామరాడ గ్రామంలో తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జనసైనికులు, భవానీ భక్తులు ఒంటి కాళ్లపై నిలబడి దీక్ష తీసుకుని తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన తిరుపతి లడ్డు అపవిత్రం కారణంగా హిందువుల మనో భావాలు దెబ్బతిన్నాయని, దీనిపై వెంటనే సిబిఐ ఎంక్వయిరీ వేసి జగన్ రెడ్డిని అరెస్టు చేయవలసిందిగా కోరుతున్నామని, తిరుపతి లడ్డు అపవిత్రం అయినందుకు తమ నాయకుడు పవన్ కళ్యాణ్ చేస్తున్నటువంటి ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గత వారం రోజుల నుంచి నియోజకవర్గంలో భారీ ఎత్తున నిరసన దీక్ష కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈరోజు తామరాడ గ్రామంలో జన సైనికులు, భవానీ భక్తుల తో ఒంటి కాళ్లపై నిలబడి దీక్ష చేశామని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో కాయల మణికంఠ, సుంకర రాజు, ఎలుగుబంటి శ్రీను భవాని, సంకాబత్తుల రాంబాబు, కాయల తాతీలు, కాయల వినయ్,అప్పికొండ శివ, అడపా సతీష్,తోట శ్రీను,మొండి దుర్గ బాబు, కరణం వీరబాబు, తోటకూర శివ, ఎలుగుబంటి చిన్న, వెంకన్న, వర్రే సతీష్,సామల దుర్గబాబు, జాన్, స్వప్న, తుంపాల పండు,బండారు అశోక్, రేవూరి శీను బచ్చల రాజు, కోలమూరు బుజ్జి, సూరిబాబు ఇతరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన హృదయం.. ఆనందకరమైన జీవితం

- గుండె సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలి
- వాక్ ఫర్ హార్ట్ ప్రారంభ సందర్భంగా డీసీపీ ఎం. కృష్ణమూర్తి నాయుడు
- కార్డియలాజికల్ సొసైటీ ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో 5కె వాకథాన్
- వాక్ ఫర్ హార్ట్.. లవ్ యు ఆంధ్రప్రదేశ్.. కార్యక్రమానికి విశేష స్పందన



**గాంధీనగర్, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందని డీసీపీ ఎం. కృష్ణమూర్తి నాయుడు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా, కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ నిర్వహించిన వాక్ ఫర్ హార్ట్.. లవ్ యు ఆంధ్రప్రదేశ్.. 5కె వాకథాన్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బీఆర్టీఎస్ రోడ్డు శ్రీ శారదా కళాశాల వద్ద ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి డీసీపీ కృష్ణమూర్తి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుండె సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఆయన సూచించారు. హృదయ సంబంధ వ్యాధులు, గుండె ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణుడు డాక్టర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ, హృదయ సంరక్షణ కోసం సమతుల ఆహారం, సక్రమమైన జీవన విధానం, తగినంత శారీరక శ్రమ తప్పనిసరి అని అన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు, వాటిని అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే వైద్య పరిజ్ఞానం అందుబాటులో వచ్చిందని, గుండెపోటు వచ్చిన తొలి గంటలోనే చికిత్స అందిస్తే ప్రాణాపాయాన్ని తప్పించవచ్చని డాక్టర్ రమేష్ బాబు వివరించారు. కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ట్రెజరర్ డాక్టర్ ఎ. పూర్ణానంద్ మాట్లాడుతూ, హృద్రోగాల బారిన పడకుండా ఉండాలంటే.. మానసిక ఒత్తిడికి గురికాకుండా, ఆహ్లాదకరమైన జీవితాన్ని గడపాలని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. 40 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరూ తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ పూర్ణానంద్ సూచించారు. శ్రీ శారదా కళాశాల వద్ద ప్రారంభమైన ఈ 5కె వాకథాన్.. గుండె సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఆర్టీఎస్ రోడ్డులో కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె. శ్రీమన్నారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు, అనేక మంది నగర పౌరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రైల్ మద్దూర్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం




**గాంధీనగర్, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ఇండియన్ రైల్ మద్దూర్ యూనియన్, జనరల్ బాడీ సమావేశము విజయవాడ యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ ప్రెసిడెంట్ ఎస్ మీరయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో గత సంవత్సర కాలంగా జరిగిన కార్యకలాపాల నివేదికను యూనియన్ ప్రధాన కార్యదర్శి పులివర్తి రవీంద్రనాయుడు ప్రవేశపెట్టారు. ఈ నివేదికలో కొన్ని తీర్మానాలను పొందుపరిచారు. 1)కోవిడ్ సమయంలో నిలుపుదల చేసిన 18 నెల మూడు డి ఏ లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి 2)ఏడవ వేతన సంఘం 2016 నుంచి అమలు జరపవలసి ఉండగా కేంద్ర ప్రభుత్వం 2017 నుంచి అమలు జరిపి కోట్లాది రూపాయలు అరియర్స్ నిలుపుదల చేసింది తక్షణమే ఆ బకాయిలను చెల్లించాలి. 3)ఎన్ పి ఎస్ ను యుపిఎస్‌గా పేరు మార్చి కార్మికులను మభ్యపెడుతున్నారు యుయుపిఎస్ వల్ల ఎటువంటి ప్రయోజనం చేయకూడదు కార్మికులకు ఓల్డ్ పెన్షన్ స్కీం తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాం. 4)డిసెంబర్ నెలలో జరుగు రైల్వే ట్రేడ్ యూనియన్ సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో రైల్వే యాజమాన్యం సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికలను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లాగా సెంట్రల్ లేబర్ కమిషనర్ పర్యవేక్షణలో జరిపించాలి. 5)ఎన్నికల నిబంధన ప్రకారం అన్ని ట్రేడ్ యూనియన్లకు సమాన అవకాశం కల్పించాలి ,లెవెల్ ప్లేయింగ్ అమలు చేయాలి అన్ని రిజిస్టర్ ట్రేడ్ యూనియన్లకు సమాన అవకాశం కల్పించాలి. 6)ఇప్పటివరకు ఆనధికారికంగా చలామణి అవుతున్న ట్రేడ్ యూనియన్లు మజ్దూర్ యూనియన్, ఎంప్లాయి సంఘ్ లకు ,రైల్వే యాజమాన్యం కల్పించిన వసతులు వెనక్కి తీసుకోవాలి ఆఫీసులను ఖాళీ చేయించాలి. 2013 ఎన్నికల తరువాత తర్వాత కాల పరిమితి 2017తో ముగిసిపోయినప్పటికీ ఇప్పటివరకు వారిని గుర్తింపు సంఘాలు గా పరిగణించడం పక్షపాత ధోరణికి నిదర్శనము 7)ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో పోటీ చేయు యూనియన్లు 50 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్న నిబంధనను వెనక్కి తీసుకోవాలి ఎటువంటి డిపాజిట్ లేకుండా ఎన్నికల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలి. 8)గుర్తింపు సంఘాలుగా చలామణి అవుతున్న మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంగ్‌లు రైల్వే యాజమాన్యానికి చెల్లించవలసిన ఔట్ స్టాండింగ్ న్యూస్ చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలి, బకాయిలు ఉన్న ట్రేడ్ యూనియన్ ను ఎన్నికల్లో అనుమతించరాదు, బకాయిలు చెల్లించకనే డిస్ప్యూట్ అకౌంట్ క్రింద,అక్రమంగా నో డ్యూ సర్టిఫికెట్లు ఇచ్చి ఆ యూనియన్లకు యాజమాన్యం సహకరిస్తుంది దీనిని రైల్వే ఉన్నతాధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలి.

పై డిమాండ్స్ ను రైల్వే యాజమాన్యం తక్షణమే అమలు జరపాలి. ఈ సమావేశము 17 మందితో కేంద్ర కమిటీ ఎన్నుకోబడింది. ఈ సమావేశంలో జోనల్ అధ్యక్షులు ఎస్ మీరయ్య, ప్రధాన కార్యదర్శి పులివర్తి రవీంద్ర నాయుడు,కేంద్ర కమిటీ సభ్యులు టి మోహనకృష్ణ, భాష ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# లడ్డూ అపవిత్రతను నిరసిస్తూ నేడు కలెక్టర్‌కు వినతి పత్రం

• హిందూ బంధువులంతా రావాలి



**ఎలమంచిలి, సెప్టెంబర్ 29, మనం ప్రతినిధి :** విశ్వహిందూ పరిషత్ ఎలమంచిలి మండలం ఆధ్వర్యంలో ఆదివారం సుంకర పాలెం గ్రామంలో గంగానమ్మ మారెమ్మ గుడి వద్ద ఇటీవల తిరుమల లడ్డు అపవిత్రం జరిగిన కారణంగా పాపం ప్రక్షాళణార్ధం శాంతి హోమం మరియూ హిందూ ధర్మ పరిరక్షణార్ధం మహా సుదర్శన హోమం నారాయణం మణికంఠ అజయ్ ఆచార్యులు బ్రహ్మత్వం వహించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ బజరంగ్ సమావేశంలో రేపు ఉదయం 10 గంటలకు హిందూ ధర్మంపై జరిగిన దాడుల గురించి కలెక్టర్ గారికి వివరణ తో వినతి పత్రం ఇవ్వాలని దీనికోసం ప్రతి హిందూ బంధువు కలెక్టర్ ఆఫీసుకి చేరుకోవాలి అని యలమంచిలి మండల విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దివి.ప్రకాష్ పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు బోనం అచ్యుతరామయ్య, భజరంగ్ దళ్ బొలిశెట్టి బాబీ భజరంగ్ దళ్ మండల సురక్షా ప్రముఖ శేషగిరి వీరాజీ,పతంజలి,బీ. జే.పీ.మండల ప్రెసిడెంట్ డీ.ఎన్.కుమార్ గారు బీ.జే.పి కార్యకర్తలు మరియు భజరంగ్ దల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారీగా తరలివచ్చి సామినేని ఉదయభానుకి అభినందనలు



## సామినేని ఉదయభాను సమక్షంలో భారీగా జనసేనపార్టీలో చేరికలు



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** జనసేన పార్టీలో చేరినందుకు మాజీ శాసనసభ్యులు ,మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును పెద్ద సంఖ్యలో నేతలు కార్యకర్తలు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చి అభినందనలు తెలుపుతూ జనసేన పార్టీలో చేరుతున్నారు. ఆదివారం సామినేని ఉదయభాను ను నందిగామ మండలం అడవి రావులపాడు అనాసాగరం గ్రామాలకు చెందిన పలువురు పార్టీ కార్యకర్తలు జనసైనికులు సామినేని ఉదయభాను కలసి శుభాకాంక్షలు తెలిపి ఆయనకు ఆత్మీయ సత్కార నిర్వహించారు. అలానే జగ్గయ్యపేట నియోజకవర్గం భీమవరం, వే మవరం గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు నార్ల సుధాకర్ రెడ్డి, పనితి గోపాలకృష్ణలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సామినేని ఉదయభాను సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. అలానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వీరయ్య చౌదరి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సామినేని ఉదయభాను సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి సామినేని పార్టీ కండువాలను కప్పి జనసేనలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఆళ్లూరుపాడు గ్రామానికి చెందిన నేతలు అనంత శ్రీనివాస్ సామినేని సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా సామినేని మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గం, జిల్లాలోనూ జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసైనికులను కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కట్టుబడి కృషి చేయాలని సామినేని అన్నారు.

# వాకింగ్, లాఫింగ్ ద్వారా శారీరక ఆరోగ్యం మానసిక ఉల్లాసం ఉత్సాహం



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** వాకింగ్ ద్వారా శారీరక వ్యాయామం చప్పట్లు మరియు నవ్వుల ద్వారా మానసిక ఉల్లాసం ఉత్సాహంతో ఆనందంగా ఉంటుందని వాకింగ్ మరియు లాఫింగ్ క్లబ్ సభ్యులు షేక్ భాజాని, స్విమ్మింగ్ కోచ్ పొట్ట బత్తిన పాండురంగారావు లక్ష్మీ దంపతులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని బుద్ధ విహారలో మైత్రేయ బుద్ధ వాకర్స్ లాఫింగ్ మరియు స్విమ్మర్స్ ఆధ్వర్యంలో షేక్ భాజాని నేతృత్వంలో వాకర్స్ లాఫింగ్ స్విమ్మర్స్ బుద్ధ విహార్ లో రెండు కిలోమీటర్ల వాకింగ్ నిర్వహించారు. అనంతరం బుద్ధ భగవాన్ ను ని విగ్రహం వద్ద చప్పట్లు కొట్టిన సభ్యులు అందరూ లాఫింగ్ చేశారు. ఈ సందర్భంగా షేక్ బా జా ని ,పొటాబత్తిన పాండురంగారావు లక్ష్మీ దంపతులు మాట్లాడుతూ వాకింగ్ లాఫింగ్ ద్వారా శారీరక ఆరోగ్యం మానసిక ఉత్సాహం కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై పోరాటానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధం

## జగ్గయ్యపేట సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఏ ఇబ్బంది కలిగిన ప్రజల పక్షాన పోరాటానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ప్రజా సమస్యలపై తాము నిరంతరం నిర్ణయాత్మకమైన పోరాటం చేసిఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూజగ్గయ్యపేట సమన్వయకర్తగా తనను నియమించినందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్గా చైర్మన్గా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ గా ప్రజా ప్రతినిధిగా తాను వివిధ పదవులలో పని చేశానని 2011 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామంలోనూ జగ్గయ్యపేట పట్టణంలోనూ ఉన్న సమస్యలు పై జరిగిన అభివృద్ధి పైఅవగాహన ఉందని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రధాన పక్షాలు అన్ని ఇప్పుడు అధికారంలో ఉండటంతో ప్రజా సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత గురుతర బాధ్యతలతో పోరాటానికి సిద్ధమని అన్నారు. జగ్గయ్యపేటలో గత ఐదు సంవత్సరాల్లో అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేసిందన్నారు. కోటి రూపాయలతో నిర్మించిన హైవే బస్టాండ్ ను అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం 100 రోజులు అయినా వినియోగంలోకి తీసుకురాక పోవటాన్ని ప్రశ్నించారు. టిటిడి కళ్యాణ మండపం నిర్మాణం దాదాపు పూర్తికా వచ్చిందని దాన్ని అందుబాటులోకి తేవాలని అన్నారు. టిడ్కో ఇళ్ళ కోసం లబ్ధిదారులు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని పట్టణంలో నిర్మాణంలో ఉన్న గృహాలు దాదాపు పూర్తి కావాల్సిన దశలో ఉన్నాయని వాటిని త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు. ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఐదు వేల ఎకరాల్లో వివిధ పంటలు నియోజకవర్గంలో దెబ్బతిన్నాయని అంచనాలను సరిగా వేయలేదని మరల రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. వందలాది ఎకరాల్లో మున్నేరు పాలేరులకు వచ్చిన వరద కారణంగా ఇసుకమేట వేసిందని మట్టి కొట్టుకుపోయిందని వారికి కనీసం 50 వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ విస్తృత ప్రచారం చేసిందని అధికారంలోకి వచ్చి100 రోజులైనా ఆ పథకాలు అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. తాము కూటమిలో ఉన్నామని కేంద్రం నిధులు భారీగా ఇస్తుందని మాటలు చెప్పారని ఎక్కడ కేంద్ర నిధులు ఎక్కడ పథకాల అమలు అంటూ తన్నీరు నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ,విద్యార్థులకు మహిళలకు ఇస్తానన్న డబ్బులు ఎప్పుడు ఇస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన విషయాన్ని తన్నీరు నాగేశ్వరరావు గుర్తు చేశారు. 100 రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజలు ప్రశ్నించకుండా టీటీడీ లడ్డు విషయాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చారని రాజకీయ లబ్ధి పొందేందుకే విమర్శలు చేస్తున్నారని అన్నారు. టీటీడీ స్వయం పరిపాలక సంస్థ అనిదానిలో తప్పు జరిగితే రాష్ట్ర ముఖ్యమంత్రి కి సంబంధమేంటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నందున సిబిఐతో కానీ ఏ ఇతర ఉన్నత సంస్థతో కానీ దర్యాప్తు చేయించి దోషులను శిక్షించాలని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ప్రజల దృష్టి మరలించేందుకు రాజకీయ లబ్ధి కోసమే టిటిడి అంశాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చి అసత్యప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జగ్గయ్యపేట లో త్వరలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించేందుకు తాము తమ పార్టీ సిద్ధంగా ఉంటుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు.

# కళారత్న డా.బాలచందర్‌కు జాషువా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు



**పెనుగొండ, సెప్టెంబర్ 29 మనం న్యూస్ :** ఐఎస్ఓ గుర్తింపు పొంది ముప్పది యారు సంవత్సరాలుగా తెలుగు సాహిత్యానికి అత్యున్నత సేవలందిస్తున్న అతి పెద్ద అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా కళాపరిషత్ దుగ్గిరాల ఆద్వర్యంలో జాషువా 129వ జయంతి వేడుకలు విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో 29తేది ఆదివారం ఉదయం 11.00 గంటలకు జరిగిన జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో ప్రముఖ కవి గాయకుడు డా. బాలచందర్ సాదే పాల్గొని జాషువా పద్యములు శ్రావ్యంగా ఆలపించి స్వీయ రచన నడువరా హుషారుగా జాషువా కవన బాటను అనే పాట పాడి సభను పరవశింపచేశారు అనంతరం డా. బాలచందర్ కు జాషువా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు – 2024 పురస్కారంతో ఘనంగా సత్కరించారు సంస్థ అంతర్జాతీయ వ్యవస్థాపక చైర్మన్ పెద్దిటి యోహాను మరియు కార్యవర్గం డా. రంగిశెట్టి రమేష్ డా. అయినాల మల్లేశ్వరరావు డా. దేవరపల్లి ప్రభుదాస్ తదితరులు జాషువా శ్మశానవాటి పద్యాలు అత్యద్భుతంగా పాడి ఆనందడోలికలలో మునకలు వేయించారని డా. బాలచందర్ ను ప్రశంసిస్తూ జాషువా తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పురస్కారంతో సత్కరించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గం ప్రిన్సిపాల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు బాలచందర్ కు అభినందనలు తెలియజేశారు.